కొడంగల్ నియోజకవర్గం మద్దూరులో బీఆర్ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

రైతుబంధును ఖతం చేస్తరు

కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కూడా ఖతం

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లూ ఇవ్వరు

- తెలంగాణ పదేండ్లు వెనక్కి పోతుంది
- కర్ణాటకలో 5 గ్యారెంటీలు అటకెక్కాయి
- రేటెంతరెడ్డి పార్టీ టికెట్లు అమ్ముకున్నడు
- రేపు రాష్ట్రాన్ని కూడా అమ్ముకుంటడు
- ప్రియాంక గాంధీ చెల్లని రూపాయి
- కేసీఆర్ చేతుల్లోనే తెలంగాణ సురక్షితం
- కొడంగల్, సిద్దిపేట, దుబ్బాక రోడ్‌షోల్లో మంత్రి హరీశ్‌రావు

వికారాబాద్ (నమస్తే తెలంగాణ)/సిద్దిపేట అర్బన్, నవంబర్ 28: కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతు బంధు, కరెంట్ ఖతం చేస్తారని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు కూడా రాకుండా చేస్తారని విమర్శించారు. నిజమో, కాదో తెలియాలంటే కొడంగల్ పక్కనే ఉన్న రెబ్బనపల్లి, సేడం వెళ్లి కర్ణాటక ప్రజలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. మంగళవారం కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు, సిద్దిపేటలో, దుబ్బాక నియోజకవర్గంలోని చేగుంట మండలంలోని రోడ్‌షోల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. 'కాంగ్రెస్ ఖతమైతేనే రైతుబంధు వస్తుది. కాంగ్రెస్ ఖతం కావాల్నో, రైతుబంధు ఖతం కావాలో ప్రజలు జాగ్రత్తగా ఆలోచించాలి' అని కోరారు. కాంగ్రెస్‌కు 25 నియోజకవర్గాల్లో అభ్యర్థులే లేరని, డిసెంబర్ 3న ఫలితాల్లో బీఆర్ఎస్ గెలవటం, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావటం ఖాయమని తేల్చి చెప్పారు.

కర్ణాటక ప్రజలు ఆగమైండ్రు

ఐదు గ్యారెంటీలు అని చెప్పి కర్ణాటక రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. రైతులను గోస పెడుతున్నదని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఆ గ్యారెంటీలు అటకెక్కాయని, ప్రజలు ఆగమయ్యారని తెలిపారు. ఓటు వేసేటప్పుడు ఆలోచించి వేయాలని, లేకపోతే రాష్ట్రం పదేండ్లు వెనక్కి పోతుందని వెల్లడించారు. యూపీలో ప్రియాంక గాంధీ 6 నెలలు తిరిగి 403 స్థానాల్లో ప్రచారం చేసినా, ఆ పార్టీకి వచ్చింది రెండే సీట్లు అని గుర్తుచేశారు. ఆమె చెల్లని రూపాయి అని ఎద్దేవా చేశారు. తెలంగాణ కేసీఆర్ చేతుల్లో ఉంటేనే సురక్షితంగా ఉంటుందని, కోటి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున బీమాను తీసుకొస్తామని పేర్కొన్నారు. ఆయా రోడ్‌షో కార్యక్రమాల్లో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, కొడంగల్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజారాధాకృష్ణ శర్మ, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ నియోజకవర్గం మద్దూరు రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

రేవంత్ ఓటమి ఖాయం

కొడంగల్ ప్రజల ఊపు చూస్తుంటే రేవంత్‌రెడ్డి ఓడిపోవడం ఖాయమనిపిస్తోందని హరీశ్ అన్నారు. కొడంగల్‌లో ఓడిపోతే సన్యాసం తీసుకుంటానని చెప్పిన రేవంత్.. మాట తప్పారని, ఆయన మరోసారి మాట తప్పే టైం వచ్చిందని ఎద్దేవా చేశారు. కామారెడ్డి, కొడంగల్‌లో ఓడిపోతారని స్పష్టం చేశారు. సీఎం కాదు.. ముందు కొడంగల్‌లో ఎమ్మెల్యేగా గెలవాలని గుర్నాథ్‌రెడ్డి అంటున్నారని, దీన్ని బట్టి రేవంత్‌కు ఓట్లు పడే పరిస్థితే లేదని తెలిపారు. కాంగ్రెస్ నాయకులే రేవంత్‌ను రేటెంతరెడ్డి అంటున్నారని, ఆయనను గెలిపిస్తే రాష్ట్రాన్ని కూడా అమ్ముకుంటారని ఆరోపించారు. లీడర్లను కొన్నా, ప్రజల ఆత్మగౌరవాన్ని మాత్రం కొనలేదని స్పష్టం చేశారు.

గెలిచేది.. నిలిచేది బీఆర్ఎస్సే

- రాష్ట్రవ్యాప్తంగా నిరూపించిన ప్రచార సరళి
- కాంగ్రెస్ పార్టీది వాపేనని తేల్చిన సభలు
- ఎక్స్ (ట్విట్టర్)లో మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో గెలిచేది.. నిలిచేది బీఆర్ఎస్ మాత్రమేనని ప్రచార సరళి నిరూపించినట్టు ఆర్థిక మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఈ మేరకు ఆయన ట్విట్టర్ (ఎక్స్)లో పేర్కొన్నారు. 'కాంగ్రెస్‌ది బలుపు కాదు వాపేనని విఫలమైన వారి సభలు రుజువు చేశాయి. కాంగ్రెస్, బీజేపీల నుంచి ఎంత మంది పొలిటికల్ టూరిస్టులు వచ్చినా కేసీఆర్‌కే ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ నెల 30న జరిగే పోలింగ్‌లో కేసీఆర్‌పై తెలంగాణ ఏకపక్షంగా తన అభిమానాన్ని చాటుకోబోతున్నది. మూడోసారి బీఆర్ఎస్ పార్టీని గెలిపించి, కేసీఆర్ గారిని హ్యాట్రిక్ సీఎం చేయాలని తెలంగాణ ప్రజలు మానసికంగా సిద్ధమయ్యారు. ప్రచారంలో కష్టపడ్డ బీఆర్ఎస్ శ్రేణులకు నా హృదయ పూర్వక ధన్యవాదాలు. ఈ స్ఫూర్తిని చివరి వరకు కొనసాగించి బీఆర్ఎస్‌కు భారీ విజయాన్ని అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. తెలంగాణను సాధించి, అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపిన కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా ఆశీర్వదించాలని మరొక్కసారి కోరుతున్నాను. జై తెలంగాణ.. జై కేసీఆర్' అంటూ నినదించారు. ఈ పోస్టుకు నెటిజన్ల నుంచి భారీ స్పందన వస్తున్నది. జై తెలంగాణ, అభివృద్ధికే ఓటు వేస్తామని నెటిజన్లు రీట్వీట్లు పెట్టారు.

పొలిటికల్ టూరిస్టులు తిరుగుముఖం

- హైదరాబాద్‌ను ఖాళీ చేసిన జాతీయ పార్టీల నేతలు
- కాంగ్రెస్ పార్టీ, బీజేపీ నాయకులు హస్తినకు పయనం
- నిత్యం ప్రజలకు అందుబాటులో బీఆర్ఎస్ పార్టీ నేతలు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం ముగియడంతో నాయకులంతా గప్‌చుప్ అయి పోయారు. ఇక అందరి దృష్టీ పోలింగ్ మీదనే కేంద్రీకృతమైంది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం పోలింగ్ నిర్వహించనున్నారు. దాదాపు నెల పాటు హోరెత్తిన ప్రచారం మంగళవారం సాయంత్రంతో మూగబోయింది. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నియోజకవర్గంలో ఓటు హక్కు లేని నాయకులు ఎవరూ ఇక ఆ నియోజకవర్గం పరిధిలో ఉండటానికి వీలు లేదు. దీంతో ఎన్నికల ప్రచారం కోసం ఢిల్లీ నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చిన జాతీయ పార్టీల నాయకులు తిరుగుముఖం పట్టారు. 'పొలిటికల్ టూరిస్ట్'లు అనే మాటను నిజం చేస్తూ.. ఎన్నికల ప్రచారం ముగియగానే.. హైదరాబాద్‌లో బస చేసిన నేతలంతా స్టార్ హోటళ్లను ఖాళీ చేసి శంషాబాద్ విమానాశ్రయం బాట పట్టారు. ఎవరి రాష్ట్రాలకు వారు గప్‌చుప్‌గా వెళ్లిపోయారు. మళ్లీ ఎన్నికలు వస్తేనే వారు మళ్లీ మనకు కనిపించేది! ఇక ప్రజాక్షేత్రంలో మిగిలింది గులాబీ నేతలే. ఎందుకంటే బీఆర్ఎస్ తరపున ప్రచారం చేసింది ఇక్కడ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్న నేతలే. గులాబీల తరపున పొలిటికల్ టూరిస్టులు ఎవరూ లేరు. అంతా పక్కా లోకల్. కాంగ్రెస్, బీజేపీ పరిస్థితి అందుకు భిన్నం.

ప్రచార దండయాత్ర

ఢిల్లీతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన నేతలు రాష్ట్రంపై ఒకవిధంగా ప్రచార దండయాత్ర చేశారు. కాంగ్రెస్ తరపున రాహుల్‌గాంధీ, ప్రియాంక, ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతోపాటు పలువురు ఏఐసీసీ నేతలు, రాజస్థాన్, కర్ణాటక ముఖ్యమంత్రులు, కర్ణాటక డిప్యూటీ సీఎం, ఇతర మంత్రులు అంతా ఇక్కడే మకాం వేశారు. బీజేపీ తరపున ప్రధాని మోదీ, హోం శాఖ మంత్రి అమిత్‌షాతోపాటు అనేకమంది కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జాతీయ నేతలు తండోపతండాలుగా వచ్చి ప్రచారం చేశారు. బీఆర్ఎస్ తరపున ముఖ్యమంత్రి కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీశ్‌రావు ప్రచార బాధ్యతలను తమ భుజస్కంధాలపై వేసుకుని, క్యాడర్‌ను ఉత్సాహపరిచారు. పోలింగ్ ముగిసిన తరువాత కూడా నిత్యం ప్రజల మధ్య ఉండేది, తెలంగాణ బిడ్డల కోసం ఆర్తి చెందేది, వారి హక్కుల కోసం నిలబడేది గులాబీ నేతలే.

తెలంగాణలో ఊహించని అభివృద్ధి

- ఇక్కడికి వచ్చేయాలని అనిపిస్తున్నది
- ఇలాంటి సర్కారును గెలిపించుకోవాలి
- టాంజానియా మాజీ మేయర్ గులాం హఫీజ్

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో జరిగిన అభివృద్ధిని చూస్తే ఇక్కడి వచ్చి ఉండాలని అనిపిస్తున్నదని టాంజానియాలోని షిన్యాంగా మున్సిపల్ కౌన్సిల్ మాజీ మేయర్ గులాం హఫీజ్ అబూబకర్ ముకాదమ్ పేర్కొన్నారు. మంగళవారం హోం మంత్రి మహమూద్‌అలీతో కలిసి ఆయన మాట్లాడారు. హైదరాబాద్ సహా తెలంగాణవ్యాప్తంగా మన కండ్లముందే ఊహించని అభివృద్ధి జరిగిందని చెప్పారు. 2011లో తెలంగాణకు ఒకసారి వచ్చానని, ఇప్పుడు 2023లో మళ్లీ వచ్చానని పేర్కొన్నారు. నాటికి నేటికి ఇంతటి అభివృద్ధిని కలలో కూడా తాను ఊహించలేదని చెప్పారు. టాంజానియాను వదిలి తెలంగాణను రావాలనిపిస్తున్నట్టు తెలిపారు. ఇటువంటి ప్రభుత్వాన్ని గెలిపించుకోవాల్సిన బాధ్యత తెలంగాణ ప్రజలపై ఉందని పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్‌తోనే ముస్లింల అభివృద్ధి: హోంమంత్రి

దేశంలో ముస్లిం మైనార్టీలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నా.. తెలంగాణలో ముస్లిం, మైనార్టీలంతా సుఖసంతోషాలతో ఆనందంగా ఉన్నారని, అందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కారణమని హోంమంత్రి మహమూద్‌అలీ స్పష్టం చేశారు. మైనార్టీల రక్షణ కోసం దేవుడు పంపిన ఫరిష్తా (దైవదూత) సీఎం కేసీఆర్ అని ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అజాంఅలీ, బద్రూద్దీన్, అర్షద్ అలీఖాన్, మునీభాయ్, మసిఉల్లా ఖాన్, మఖీత్ చందా, షాహీద్ తదితరులు పాల్గొన్నారు.

వడ్లరాసులపై వెంకన్న శయనించినట్టు!

III తరువాయి...

రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమనేత కేసీఆరే ముఖ్యమంత్రి ఆయ్యాక ఆయన ఏలుబడిలో తెలంగాణ జీవన దృశ్యం సమూలంగా మారిపోయింది. కరువు తాండవించిన చోట ఎక్కడ చూసినా పచ్చని పంట పొలాలు, గలగలపారే కాలువలు, నిండుకుండలా జలవనరులు, దారి పొడవునా కిలోమీటర్లమేర ఆరబోసిన ధాన్యపు రాసులు దర్శనం ఇస్తున్నాయి. తెలంగాణకు వ్యవసాయమే ప్రధాన జీవనోపాధి అయినప్పటికీ సమైక్యపాలకుల వివక్షకు గురైంది. నీటిపారుదల వనరులు లేక వ్యవసాయరంగం కుదేలయ్యింది. వర్షాధార, గొట్టపు బావులపై ఆధారపడిన సేద్యం గాలిలో దీపం మాదిరిగా సాగేది. వర్షాలు పడి, గొట్టపు బావుల్లో నీళ్లున్నా కరెంట్ ఉండేది కాదు. చేతికొచ్చిన పంట చేలు బీటలువారేవి. పెట్టుబడి కోసం చేసిన అప్పు ముప్పై తీర్చలేక రైతులు ఆత్మహత్యలు చేసుకొనేవారు. కానీ.. నేడు సీఎం కేసీఆర్ నేతృత్వంలోని పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్‌గా ఎదిగింది. తలసరి ఆదాయం, విద్యుత్తు వినియోగంలో మొదటి స్థానంలో నిలిచింది. రెండు పర్యాయాల బీఆర్ఎస్ పాలనలో ఎన్నో కొత్త సాగునీటి ప్రాజెక్టులు నిర్మించారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తయ్యాయి. మిషన్ కాకతీయ పథకంతో చెరువులు జలకళను సంతరించుకొన్నాయి. భూగర్భ జలాలు పైకి తన్నుకువచ్చాయి. ఎక్కడ చూసినా పుష్కలంగా నీళ్లు.. ఎకరానికి పది వేల రూపాయల చొప్పున రైతుబంధు.. వ్యవసాయానికి ఉచితంగా 24 గంటల కరెంట్.. దీంతో పుష్కలంగా పంటలు పండుతున్నాయి. కరువు తీరింది. వలసలు ఆగిపోయాయి. ఇప్పుడు పక్క రాష్ట్రాల నుంచి వచ్చే కూలీలకు పని కల్పించే స్థాయికి చేరుకొన్నాం. అయితే ప్రజాస్వామ్య ప్రక్రియలో ఐదేండ్లకోసారి ప్రజలు తమ ప్రభుత్వాన్ని ఎన్నుకోక తప్పదు. ఈ ఎన్నికల్లో తెలంగాణను దక్షిణాది ధాన్య బాండాగారంగా తీర్చిదిద్దిన కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వానికి మళ్లీ పట్టం కట్టేందుకు క్షేత్రస్థాయిలో ప్రజలు ఒక తాటిమీదికి వచ్చారు. తిరిగి కేసీఆర్ సర్కారే రావాలని పంతం పట్టారు. మార్పు కాదు.. మళ్లీ కేసీఆర్ సర్కారే రావాలని మనసు నిండా కోరుకుంటున్నారు. మళ్లీ కేసీఆరే హ్యాట్రిక్ సీఎం అని చెప్పేందుకు పాలమూరు జిల్లా ప్రజల మనోగతం ఒక్కటిచాలు.

ఏ గాలి లేదు

టీడీపీ, కాంగ్రెస్ జమానాలో మమ్మల్ని (దివ్యాంగులను) ఎవరూ పట్టించుకునేవారు కాదు. కేసీఆర్ వచ్చినంక మొదట 3 వేలు ఇచ్చిండు. ఇప్పుడది 4 వేలు జేసిండు. మా ఊళ్లో అందరికి చెప్పి ఏపిస్త. ఇక్కడ ఏ గాలి లేదు.. అందరం కేసీఆర్ వెంటే ఉంటం. **-నాగన్న, దివ్యాంగుడు, గోప్లాపూర్, దేవరకద్ర**

చాలినంత కరెంట్ ఉంది.. ఇంకేంగావాలి?

కేసీఆర్ వచ్చినంక చాలినంత కరెంట్ ఇస్తుండు. ఇంకేదీ అవసరం లేదు. మా ఊళ్లో అందరు మంచిగ బతుకుతుండ్రు. ముసలోళ్లకు పింఛన్ ఇస్తున్నరు. రైతులకు పైసలిస్తున్నరు. పంటలు బాగా పండుతున్నయి. ఇంతకంటే ఇంకేమిగావాలె. అందుకే కేసీఆర్ వెంటే నడుస్తం.

- జినగరాళ్ల వరలక్ష్మి, కిరణంషాప్, గోప్లాపూర్, దేవరకద్ర

కాంగ్రెస్ యాడుందయ్యా!

వాళ్ల ప్రచారమంతా వట్టి గాలే..

- బీఆర్ఎస్ పథకాలే గట్టిగా సాగాలి
- కేసీఆర్ కరెంటు,రైతుబంధు పింఛన్ ఠంఛన్‌గా ఇస్తుండు
- ఇవన్నీ కండ్లముందే ఉన్నయ్ కదా?
- మళ్లీ కేసీఆర్ వస్తేనే మంచిది
- 'నమస్తే తెలంగాణ' క్షేత్రస్థాయి పరిశీలనలో .. ప్రజల మూకుమ్మడి అభిప్రాయం

(ఎక్కలదేవి శ్రీనివాస్, నమస్తే తెలంగాణ ప్రతినిధి)

(హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): పింఛన్లతో గౌరవప్రదమైన జీవితాలను గడుపుతున్న వృద్ధులు.. రైతుబంధుతో సాగును 'పండుగ'లా మార్చుకున్న అన్నదాతలు.. కల్యాణలక్ష్మితో మురిసిపోతున్న యువతులు.. కుటుంబ పెద్ద దూరమైన ఒంటరి మహిళలకు నేనున్నానంటూ సర్కారు ఇస్తున్న వితంతు పింఛన్ల భరోసా.. అందుబాటులోకి వచ్చిన ఆధునిక వైద్యం.. నిరుపేదలకు కూడా నాణ్యమైన విద్య.. 24 గంటల కరెంటు.. రైతు రుణ మాఫీ.. ఇంటింటికీ నల్లా నీళ్లు, రోడ్లు, మౌలిక వసతులు.. ఇలా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్నెన్నో పథకాలతో పల్లె, పట్టణం అన్న తేడాలేకుండా అన్నిచోట్లా సంక్షేమం వర్ధిల్లుతున్నది. కేసీఆర్ ప్రభుత్వం తమ జీవితాలకు చుక్కానిలా మారిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. వేలంలో పోటీపడ్డట్టుగా ప్రతి పక్షాలు ఇస్తున్న హామీలు నీటి మీది రాతలేనని తేల్చి పారేస్తున్నారు. సోషల్‌మీడియాలో కాంగ్రెస్‌వైపు వీస్తున్నదంతా ఒట్టి బుర్ర గాలేనని కొట్టిపారేస్తున్నారు. ఎన్నికలపై సామాన్యులు ఏమనుకొంటున్నారనేది తెలుసుకొనేందుకు 'నమస్తే తెలంగాణ' క్షేత్రస్థాయిలో పర్యటించింది. హైదరాబాద్ శివారు నుంచి మొదలుకుని.. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలోని పలు గ్రామాల వరకు ప్రజల అభిప్రాయాలను తెలుసుకొన్నది. ఎక్కడికెళ్లినా బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాల గురించి ప్రజలు గొప్పగా చెప్పుకోవటం కనిపించింది.

నాడు.. నేడు మార్పుపై ప్రజల విశ్లేషణ

తెలంగాణలో రాజకీయ చైతన్యం ఎక్కువ. బర్రెలు కాసే నిరక్షరాస్యులు కూడా రాజకీయాలపై అద్భుతంగా విశ్లేషణ చేయగలరు. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీలు ఇచ్చిన హామీలపై గ్రామాల్లో చర్చ తీవ్రంగా సాగుతున్నది. గత పదేండ్లలో బీఆర్ఎస్ సర్కారు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయి. ఇప్పుడు రాష్ట్రంలో కనీసం ఏదో ఒక ప్రభుత్వ పథకం ద్వారా లబ్ధి పొందని వారు ఒక్కరు కూడా లేరంటే అతిశయోక్తి కాదు. కాంగ్రెస్ ప్రచారం చేసుకొంటున్న 'గాలి' అంతా ఉత్తదేనని అభిప్రాయాలను బట్టి తెలుస్తున్నది. పథకాలు, అభివృద్ధి విషయంలో పూర్తి సంతృప్తికరంగా ఉన్నట్టు స్పష్టంగా చెప్తున్నారు. కాంగ్రెస్ బలపడిందన్న వాదనతో రైతులెవరూ ఏకీభవించటంలేదు.

గుంభనంగా ఓటర్లు

ఈసారి ఓటర్లలో అత్యధికులు ఎవరికి ఓటేయాలో ముందుగానే నిర్ణయించుకొన్నట్టు వారితో మాట్లాడిన తర్వాత అర్థమైంది. అయితే, చాలామంది క్షేత్రస్థాయిలో వాస్తవాలు చెప్తున్నప్పటికీ.. వారి పేర్లను, ఫొటోలను ప్రచురించడానికి ఒప్పుకోలేదు. గ్రామాల్లో ఈ మధ్య కాంగ్రెస్ నేతలు, కార్యకర్తల బెదిరింపులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయని, ఓటు వేసేవాళ్లకే వేస్తామని.. కానీ, అనవసర గొడవలు మెడకు చుట్టుకోవటం ఇష్టంలేదని చెప్తున్నారు. మెదక్ సమీపంలో ప్రధాన రహదారిపై జామకాయలు అమ్ముకునే మహిళతో 'నమస్తే తెలంగాణ' మాట్లాడింది. తన భర్త రెండేండ్ల క్రితం చనిపోయారని, అందుకు రైతుబీమా కింద రూ.5 లక్షలు వచ్చినట్టు ఆమె చెప్పారు. రైతుబంధు డబ్బులు సమయానికి వస్తున్నాయని తెలిపారు. తాను బీఆర్ఎస్ వెంటే నడుస్తానని చెప్తూనే.. తన పేరు, ఫొటో ప్రచురిస్తే గ్రామంలో ఇబ్బంది అయితదని చెప్పారు. ఆసిఫాబాద్ నియోజకవర్గం పరిధిలోని నార్నూర్ మండలంలోని ఒక తండాకు చెందిన గిరిజన రైతు (60) తాను.. 2004 నుంచి టీఆర్ఎస్ (బీఆర్ఎస్) వెంటే నడుస్తున్నానని వెల్లడించారు. 5 ఎకరాల వ్యవసాయ భూమికి రైతుబంధు వస్తున్నదని, కల్యాణలక్ష్మితో కూతురి పెండ్లి చేశానని, గిరి వికాసం పథకంలో భాగంగా రూ.5 లక్షలతో బోరు వేసి, కరెంటు మోటర్ బిగించినట్టు తెలిపారు. మంచినీరు, కరెంట్, వైద్యం, విద్య, ఇతర పథకాలు బాగున్నాయని వెల్లడించాడు. బాన్సువాడ నియోజకవర్గం రుద్రూర్‌లో కంప్యూటర్ సెంటర్‌ను నడుపుకుంటున్న ప్రవీణ్ (34) మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్లు, మంచినీళ్లు, కరెంటు, వైద్యం చాలా మెరుగయ్యాయని తెలిపాడు.

ఇద్దరు బిడ్డల పెండ్లి చేసిన

14 ఏండ్ల కింద దుబాయ్ పోయిన. తెలంగాణ వచ్చినంక 24 గంటల కరెంటు తో నా భార్య 3 ఎకరాలను సాగు చేసేది. నేను దుబాయ్ నుంచి పంపే డబ్బులు పంపేవాడిని. అదంతా కలిపి ఇద్దరి బిడ్డల పెండ్లిళ్లు చేశాను. మొన్ననే రూ.86 వేల రైతు రుణం మాఫీ అయ్యింది. 3 ఎకరాలకు రైతు బంధు వస్తున్నది. కేసీఆర్ ఇచ్చే 24 గంటల కరెంట్‌తో నాకు బేఫికర్. మళ్లా కేసీఆరే 100 శాతం గెలుస్తడు.

- కేతావత్ కిషన్, బెల్యానాయక్ తండా, మల్లారం బాన్సువాడ నియోజకవర్గం

గౌరవంగా బతుకుతున్నం

నాకు చిన్నప్పుడే పెండ్లయ్యింది. మా ఆయన డ్రైవర్‌గా పనిచేసేవాడు. నా కూతురు చిన్న పిల్లగా ఉన్నప్పుడే ఆయన చనిపోయాడు. అప్పటి నుంచి అంటే.. దాదాపు 35 ఏండ్ల నుంచి నాకు వితంతు పింఛను వస్తున్నది. మొదట్లో రూ.50 పింఛన్ ఇచ్చేవారు. ఆ తరువాత దానిని రూ.75కు.. ఆపై రూ.200కు పెంచారు. తెలంగాణ వచ్చినంక రూ.2016 ఇస్తున్నారు.

- ఠాగూర్ ప్రేమల (60), రాజంపేట, ఆసిఫాబాద్ నియోజకవర్గం

మరింత చేస్తాడనే నమ్మకం ఉన్నది

తెలంగాణ రాకముందు కాంగ్రెస్ పాలనలో ఎన్నో కష్టనష్టాలు పడ్డాం. తెలంగాణ వచ్చినంక సీఎం కేసీఆర్ ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తూ వస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ కార్మికులను గుర్తించడం సంతోషకరం. అంతకుముందే నేను రిటైర్ అయిన. అయినా నాకు అసంతృప్తి లేదు. నాకు 4 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. దీనికి రైతు బంధు వస్తున్నది. పత్తి పండిస్తున్నాను. పింఛన్లు, కల్యాణలక్ష్మి, రైతుబంధు, కరెంటు బాగున్నాయి. కేసీఆర్‌ను మళ్లీ గెలిపిస్తే మరింతగా మంచి చేస్తాడనే నమ్మకం ఉన్నది. అందుకే కేసీఆర్ కావాలి.. కేసీఆర్ రావాలి.

-జెట్టె సుధాకర్, రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్, రామాయి, ఆదిలాబాద్ నియోజకవర్గం

నా కొడుకు కేసీఆరే గెలుస్తాడు

నా కొడుకులు, బిడ్డలు సరిగా చూడకపోయినా.. నా పెద్దకొడుకులాంటి కేసీఆర్ ఇచ్చే రూ.2016 పింఛన్‌తో తింటున్నా, మంచిగా బతుకుతున్నా. నూటా మూడేండ్ల వయస్సులోనూ బతికి ఉన్నానంటే అది నా బిడ్డ కేసీఆర్ ఇచ్చే పింఛనే కారణం. నాకెవ్వరూ దిక్కులేరు. కేసీఆరే దిక్కు. ఆయననే దీపం.. ఆయనదే అన్నం. ఆయనదే ధీమా.. ఆయనకే మా ఓటు. ఆయన్నే గెలిపియ్యాలని అందరికీ చెప్తున్నా. మీరే గెలవాలి కొడుకా. ఎవ్వరొచ్చినా మాకు అన్నం పెట్టరు. మీరు తెలంగాణ తేవట్టే మేము బతుకుతున్నాం. మీరే రావాలి కొడుకా.

-బల్ల ప్రమీల (103), నస్పూర్, మంచిర్యాల

కేసీఆర్ చేసింది కనపడుతున్నది

మా సొంతూరు తాండూరు.. క్యాబ్ డ్రైవర్‌గా హైదరాబాద్‌లోనే పని చేస్తున్నా. నేను మొదటి నుంచి కాంగ్రెస్ అభిమానిని. కానీ కాంగ్రెస్ నుంచి గెలిపించిన నాయకులు వేరే పార్టీల్లోకి వెళ్లిపోతున్నారు. తెలంగాణ వచ్చిన తరువాత సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి ఎక్కువగా ఉన్నది. ఇప్పుడు నేను బీఆర్ఎస్‌కు మద్దత్తుగా నిలవాలనుకుంటున్నా. కరెంటు, తాగునీరు, రోడ్లు, పింఛన్లు, కల్యాణలక్ష్మి.. ఇలా చాలా పథకాలు ప్రజలకు అండగా ఉంటున్నాయి. అందుకే ఇప్పుడు బీఆర్ఎస్ వైపు ప్రజలు ఉన్నారు. మరోసారి కేసీఆర్ సీఎం కావడం ఖాయం.

- కాకి వెంకటేశ్, క్యాబ్ డ్రైవర్, హైదరాబాద్